## సింగరేణి పాలిటెక్నిక్‌లో సీట్ల భర్తీకి నోటిఫికేషన్

సీసీసీ నస్పూర్/రెబ్బెన, జూన్ 23 : సీసీసీ నస్పూర్ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరం ఫస్టియర్‌లో 300 సీట్ల భర్తీకి సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. సివిల్స్‌లో 60, కంప్యూటర్‌లో 60, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌లో 60, మెకానికల్‌లో 60, మైనింగ్‌లో 60 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నది. 150 సీట్లు సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలు జూలై 3వ తేదీలోగా వెబ్‌సైట్ https://scp.scpolytechnic.com/online-admission ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మిగిలిన 150 సీట్లను కన్వీనర్ కోటా ప్రవేశాల కోసం ప్రభుత్వ వెబ్‌సైట్ https://tgpolycet.nic.in ద్వారా 24 నుంచి 28వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపింది. వివరాలకు 90102 22161, 87901 12515 నంబర్లను సంప్రదించాలని కోరింది.

## పీఎం జుగాతో మౌలిక వసతుల కల్పన

కెరమెరి, జూన్ 23 : పీఎం జుగా పథకం ద్వారా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి అన్నారు. కెరమెరి మండలం సాకడ గ్రామంలో సోమవారం పీఎం జుగా పథకం అమలు తీరుపై గ్రామసభ ఏర్పాటు నిర్వహించారు. ఈ పథకంలో సాకడ గ్రామం ఎంపికైందని, రానున్న రోజుల్లో రోడ్డు, రవాణా, అంగన్‌వాడీ, పాఠశాల, పక్కా గృహాలు, కమ్యూనిటీ భవనాలు, ఇతర అవసరమైన వసతులు కల్పిస్తామని తెలిపారు.

హాజీపూర్, జూన్ 23 : నాగారం, కొలాంగూడ గిరిజన గ్రామాల్లో డీటీడీవో జనార్దన్ అవగాహన కల్పించారు. నిరుపేద గ్రామాల్లోని గిరిజనులకు పక్కా గృహాలు, రోడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, ఆరోగ్యం, టెలీ కమ్యూనికేషన్, బ్యాంక్ పాస్‌బుక్, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, ఆధార్, రేషన్ కార్డు, అంగన్‌వాడీ పాఠశాలల ఎల్పీజీ గ్యాస్ సౌకర్యం కల్పించడంపై వివరించారు. జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి బండ జీవరత్నం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఆదిత్య భాను, గఢ్‌పూర్ కార్యదర్శి సుధాకర్, రాజ మల్లయ్య, ఎసీఆర్‌పీలు రఘునాథం, చందు, ఉపాధ్యాయులు నారాయణ, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అనిల్, అంగన్‌వాడీ టీచర్ దేవమ్మ, ఆశకార్యకర్త శాంతిసుధా, స్పెషల్ ఆఫీసర్ గిరిజ పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సుల్లో పోలీసుల తనిఖీ



మంచిర్యాల అర్బన్ : బస్సులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ ప్రవీణ్

మంచిర్యాల అర్బన్, జూన్ 23 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో లక్షెట్టిపేట జాతీయ రహదారి బైపాస్‌రోడ్డు సమీపంలో సోమవారం పట్టణ పోలీసులు ఆర్టీసీ బస్సుల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులను బయటకు దింపి, వారి బ్యాగులను పూర్తిగా పరిశీలించారు. వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్సులో గంజాయి, ఇతర నిషేధిత పదార్థాలు తరలిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. శనివారం బెల్లంపల్లి ఏరియాలో ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు గుర్తించి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

హాజీపూర్, జూన్ 23 : హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్సులను జాతీయ రహదారిపై నిలిపి తనిఖీ చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఉట్నూర్ నుంచి మంచిర్యాల వైపు వస్తున్న బస్సుల్లో గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందించాడు. మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆదేశాల మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ తమ సిబ్బందితో బస్సుల్లో తనిఖీ చేసి, ఆరా తీశారు. కాగా, గంజాయి తరలిసుతన్న నిందితుడు లక్షెట్టిపేటలో బస్సు మారి ధర్మారం మీదుగా కరీంనగర్ వెళుతూ ధర్మారం పోలీసులకు చిక్కాడు. దాదాపు 2 కిలోలకుపైగా, గంజాయి పట్టుబడినట్లు సమాచారం. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్‌ను సంప్రదించగా, 26వ తేదీ వరకు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా, వ్యతిరేఖ కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు, తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు.

## సమస్యల పరిష్కారానికే విద్యుత్ ప్రజావాణి

మంచిర్యాలటౌన్, జూన్ 23 : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వీ గంగాధర్ తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 719 ఫిర్యాదులు రాగా, 632 పరిష్కరించామని తెలిపారు. సమస్య తీవ్రతను బట్టి అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. సర్కిల్ ఆఫీస్, డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్‌లలో ప్రజావాణి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## 'ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి'

చెన్నూర్ టౌన్, జూన్ 23 : ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో ఎండీ అజ్మత్ అలీ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలను స్వీకరించారు. తహసీల్దార్ మల్లికార్జున్, ఐకేపీ ఏపీఎం బీ ప్రమీల, ఉపాధిహామీ ఏపీవో జీ గంగాభవాని, వ్యవసాయాధికారి కే యామిని, ప్రీతమ్ రెడ్డి, ఏఈఈ ఇరిగేషన్, మహేశ్వర్, ఏఈఈ ఆర్‌డబ్ల్యూఎస్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాండూర్, జూన్ 23 : తాండూర్ తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ, మండల పరిషత్, పోలీసులు సంయుక్తంగా భూ తగాదాల సమస్యల పరిష్కార వేదిక, ప్రజావాణి నిర్వహించారు. భూ తగాదాలు, ఇతర సమస్యలపై వినతులు స్వీకరించనున్నట్లు తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాధ్యతలు

భీమిని, జూన్ 23 : భీమిని మండంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జీ సూపరింటెండెంట్‌గా వేణుగోపాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. సిబ్బంది ఆయనను సన్మానించారు.

## కాలం చెల్లిన బస్సులు సీజ్ చేయాలి

నస్పూర్, జూన్ 23 : మంచిర్యాల జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన కాలం చెల్లిన బస్సులను సీజ్ చేయాలని కోరుతూ సోమవారం తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర నాయకుడు చిప్పకుర్తి శ్రీనివాస్ జిల్లా రవాణా శాఖ అధికారికి వినతి పత్రం అందించారు. ప్రైవేటు పాఠశాలలు ధనార్జనే ధ్యేయంగా ఫిట్‌నెస్ లేని, కాలం చెల్లిన బస్సుల ద్వారా విద్యార్థులను తీసుకెళ్తున్నాయని, వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, సందేశ్ పాల్గొన్నారు.

## పర్సనల్ విభాగం హెచ్‌వోడీగా రాజేశ్వర్‌రావు

రెబ్బెన, జూన్ 23 : బెల్లంపల్లి ఏరియా పర్సనల్ విభాగం హెచ్‌వోడీగా ఎస్‌వీ రాజేశ్వర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం కార్పొరేట్ ఎడ్యుకేషన్ విభాగంలో డీవైపీఎంగా విధులు నిర్వహించిన ఈయన, ఇక్కడికి బదిలీపై వచ్చారు. సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంటుల బాబా, అర్చన, అనిల్, వెంకటరెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 23 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో గణితశాస్త్రం, భౌతిక శాస్త్రం బోధించేందుకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు 26వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు సంబంధిత ధ్రువపత్రాల జిరాక్సులతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నెలకు రూ.18,200 వేతనం ఉంటుందని, వివరాలకు 81065 12531 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

# ఇండ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం చేయద్దు

**కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**



ఇండ్ల నిర్మాణాలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కెరమెరి, జూన్ 23 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని, నాణ్యత పాటిస్తూ వేగంగా పూర్తిచేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులను ఆదేశించారు. కెరమెరి మండలం కొటారి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సోమవారం గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. సిమెంటు ఇటుకలు, ఇసుక నాణ్యతను పరిశీలించారు. పనుల బిల్లులు ప్రతి సోమవారం లబ్ధిదారుడి ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు ఫొటోలతో సహా ఆన్‌లైన్ పోర్టల్‌లో వెంటనే నమోదు చేయాలని తెలిపారు. అనంతరం మండలంలోని సావర్‌ఖేడలోని ప్రధానమంత్రి శ్రీ ఇంగ్లిష్ మాధ్యమ పాఠశాలను సందర్శించారు. బోధన తీరు, పాఠ్యపుస్తకాలు, వంటకు వినియోగించే కూరగాయల నాణ్యత, వంటశాలను పరిశీలించారు. తరగతి గదులు, వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. జిల్లా గృహ నిర్మాణ అధికారి వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో అమ్జద్‌పాషా, డీఈవో ఉదయ్‌బాబు, ఎంఈవో ఆడే ప్రకాశ్, హెచ్‌ఎం కడేర్ల రంగయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలపై అవగాహన



మందమర్రి రూరల్ : కేజీబీవీ ఆవరణలో మొక్క నాటి, నీరు పోస్తున్న డీసీపీ భాస్కర్

మందమర్రి రూరల్, జూన్ 23 : యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆదర్శ (మోడల్) స్కూల్, కేజీబీవీల్లో సోమవారం విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణ, వాటి పరిణామాలపై బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌తో కలిసి మంచిర్యాల డీసీపీ భాస్కర్ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో రాజేశ్వర్, కేజీబీవీ జిల్లా కో ఆర్డినేటర్ యశోధర, ఎస్ఐ రాజశేఖర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సారా తస్నీం, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సునీత, అదనపు ఎస్ఐ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గణపతి, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

వేమనపల్లి/సీసీసీ నస్పూర్/కన్నెపల్లి/కోటపల్లి/కాసిపేట/లక్షెట్టిపేట/భీమిని/చెన్నూర్ టౌన్/తాండూర్/హాజీపూర్/శ్రీరాంపూర్, జూన్ 23 : వేమనపల్లి మండలం నీల్వాయి జడ్పీ ఉన్నత పాఠశాలలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్.., విలేజ్‌నస్పూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సీసీసీ నస్పూర్ ఎస్ఐ ఉపేందర్‌రావు.., కన్నెపల్లి జడ్పీ సెకండరీ పాఠశాలలో తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్ఐ గంగారాం.., కోటపల్లి మోడల్ స్కూల్‌లో కోటపల్లి ఎస్ఐ రాజేందర్.., కాసిపేట మండలం మల్కెపల్లి ఆశ్రమ పాఠశాలలో దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు.., లక్షెట్టిపేట పట్టణంలోని గుడ్‌షెఫర్డ్ స్కూల్‌లో ఎస్ఐ గోపతి సురేశ్.., భీమిని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ విజయ్‌కుమార్.., చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ దేవేందర్ రావు.., తిర్యాణి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఎస్ఐ శ్రీకాంత్.., దండేపల్లి మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఏఎస్ఐ వెంకన్న అవగాహన కల్పించారు. తాండూర్ సీఐ కార్యాలయం, మాదారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ కే కుమారస్వామి, ఎస్ఐ సౌజన్య తంగళ్లపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో.., మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ బాలుర కళాశాలలో మంచిర్యాల షీటీం సీఐ నరేశ్, హాజీపూర్ పోలీస్ స్టేషన్, ముల్కల్ల, సబ్బపెల్లి ప్రభుత్వ పాఠశాలలు, శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో.. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐ సంతోష్ మొక్కలు నాటారు.

## సదరం సర్టిఫికెట్‌పై అవగాహన

మంచిర్యాల అర్బన్, జూన్ 23 : తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు వికలాంగుల సదరం యూడీఐడీ కార్డుల సర్టిఫికెట్ కోసం సోమవారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ దవాఖానలో సూపరింటెండెంట్ హరీశ్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాధితులు తమ వద్ద ఎలాంటి మెడికల్ రిపోర్ట్స్ ఉన్నా దవాఖానకు రావాలని సూచించారు. పిల్లల వైద్యుడు వేదవ్యాస్, జనరల్ ఫిజీషియన్ అనురాగ్, పతాలజిస్ట్ సుగుణాకర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ, తల సేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్, సభ్యులు కలవల శంకరయ్య, టీహబ్ మేనేజర్ వెంకటేష్, బాధితులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పరిహారం చెక్కులు పంపిణీ

వేమనపల్లి, జూన్ 23 : విద్యుత్ షాక్‌తో మృతిచెందిన బర్రెలకు సంబంధించి నీల్వాయి సబ్‌స్టేషన్‌లో సోమవారం బాధిత రైతులకు మాజీ జడ్పీటీసీ ఆర్ సంతోష్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్ నష్టపరిహారం చెక్కులు అందజేశారు. మంగెనపల్లి గ్రామానికి చెందిన వెనగంటి చిన్నన్న, రాములు, హరి, కమలకు రూ.40 వేల చొప్పున అందించినట్లు ఏఈ తెలిపారు. నాయకులు సాబీర్ అలీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, మాజీ సర్పంచ్ గాలి మధు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు జాహీద్‌అలీ, మాజీ ఉప సర్పంచ్ మధుసూదన్, తిరుపతిరెడ్డి, పూర్ణచందర్‌రెడ్డి, ఆవుల మారి పున్నం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌డీవో బాధ్యతల స్వీకరణ

జన్నారం, జూన్ 23 : జన్నారం ఎఫ్‌డీవోగా రామ్మోహన్ సోమవారం డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ అడవుల్లో జీవవైవిద్యంపై అన్వేషిస్తానని పేర్కొన్నారు. వృక్ష, జంతువుల సంరక్షణ చేస్తూ, అటవీ సమస్యలను స్థానికులు, ప్రజల సహకారంతో పరిష్కరించి, ప్రజలకు పర్యావరణంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఇందన్‌పెల్లి, జన్నారం ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్లు కారం శ్రీనివాస్, సుష్మారావు, అటవీ శాఖ సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## మెప్మా ఆధ్వర్యంలో ఉత్పత్తులతో మేళా

చెన్నూర్, జూన్ 23 : చెన్నూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో సోమవారం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులతో మేళా నిర్వహించారు. గతంలో మెప్మా ద్వారా పట్టణంలోని 15 స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఒక్కో సంఘానికి రూ.20 లక్షల చొప్పున రుణాలు అందజేశారు. ఈ సంఘాల సభ్యులు వివిధ రకాల ఉత్పత్తులు తయారు చేసి విక్రయాలు చేస్తున్నారు. ఆ ఉత్పత్తులను ప్రదర్శిస్తూ మేళా ఏర్పాటు చేశారు. కమిషనర్ మురళీకృష్ణ, మెప్మా టీఎంసీ రామకృష్ణ, ఆర్పీలు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

మంచిర్యాల టౌన్, జూన్ 23 : మంచిర్యాల ఆర్టీసీలో మంగళవారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ప్రయాణికుల నుంచి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. డిపో పరిధిలో నడిచే బస్సుల సమయాలు, మార్పులు, చేర్పులకు సంబంధించి ప్రజలు 99592 26004 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

## ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరిక

కౌటాల, జూన్ 23 : కౌటాల మండలం గురుడుపేటలో ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సోమవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేరినట్లు ఎంఈవో గావుడే హన్మంతు తెలిపారు. మాజీ సర్పంచ్ తన నలుగురు పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు పేర్కొన్నారు. హెచ్‌ఎం ప్రవళిక, సిబ్బంది పనితీరు వల్లే చేరుతున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ బ్రహ్మయ్య, ఉపాధ్యాయులను అభినందించారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి

నస్పూర్, జూన్ 23 : పీఎం జన్‌మన్, పీఎం జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్, పీఎం ధర్తీ అభ జనభాగీదరి అభియాన్ కార్యక్రమాల ద్వారా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని మంచిర్యాల జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి జనార్దన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడుతగా 500 మంది గల గ్రామాలు, 50 శాతం గిరిజన జనా భా గల 7 మండలాల్లోని 11 గ్రామాలు ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

## జలశక్తి అభియాన్ పనుల పరిశీలన

జన్నారం, జూన్ 23 : జలశక్తి అభియాన్ పథకం ద్వారా జన్నారం మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్, సింగరాయిపేట, చింతగూడ, మల్యాల, పొనకల్, బాదంపెల్లి, కలమడుగు, మొర్రిగూడ, ఇందన్‌పెల్లి, కామన్‌పెల్లి, కిష్టాపూర్, కవ్వాల్ గ్రామాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన 71 పనులను సెంట్రల్ టీం శాస్త్రవేత రాంబాబు, సభ్యులు సోమవారం పరిశీలించారు. జిల్లా కార్యాలయ సిబ్బంది సత్యనారాయణ, సదానందం, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, ఏపీవో రవీందర్, ఈసీ విలాస్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## డీఐఈవో కార్యాలయంలో సంప్రదించాలి

మంచిర్యాల టౌన్, జూన్ 23 : మంచిర్యాల పట్టణంలోని కాలేజీరోడ్‌లో గల ప్రతిభ జూనియర్ కాలేజీలో చదివిన విద్యార్థులు తమకు ఏ సమస్య ఉన్నా డీఐఈఓ కార్యాలయంలో సంప్రదించాలని డీఐఈఓ కే అంజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కాలేజీలో చదివిన విద్యార్థులు తమ టీసీల కోసం గానీ, ఇతర సమస్యల పరిష్కారం కోసం తమను సంప్రదించాలని తెలిపారు. కలెక్టరేట్‌లోని రెండో అంతస్థులో ఉన్న రూం నంబర్ ఎస్4లో తమ కార్యాలయం ఉన్నదని పేర్కొన్నారు.

## ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లు కీలకం

శ్రీరాంపూర్, జూన్ 23 : సింగరేణి ఉత్పత్తి, ఉత్పాదకత సాధనలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఎంవీటీసీలో సోమవారం భూగర్భ, ఉపరితల గనులు, వివిధ విభాగాల ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లకు 12 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను జీఎం ప్రారంభించారు. సింగరేణి వ్యాప్తంగా ప్రతీ ఐదేళ్లకోసారి స్ట్రక్చర్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్వోటూ జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్లు కల్లూరి వెంకట రామారావు, కమ్రుదీన్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీపూర్‌లో బస్సు ఆపాలి

కోటపల్లి, జూన్ 23 : చెన్నూర్ నుంచి సిరొంచ-కాళేశ్వరం రూట్‌లో వెళుతున్న బస్సులు లక్ష్మీపూర్ వద్ద ఆపాలని మాజీ సర్పంచ్ పానెం శంకర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు తహసీల్దార్ రాఘవేంద్రరావ్‌కు వినతి పత్రం అందించారు. చెన్నూర్ నుంచి ఈ రూట్‌లో నడుపుతున్న బస్సులను ఆపకపోవడంతో ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. పారుపల్లి క్రాస్‌రోడ్డు, ఎర్రాయిపేట, రాంపూర్, దేవులవాడ, బబ్బెరచెలుక, లక్ష్మీపూర్‌లో ఆపకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

## పట్టణ ఎస్ఐగా సాగర్ బాధ్యతలు

కాగజ్‌నగర్, జూన్ 23 : పట్టణ ఎస్ఐగా సాగర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్‌బీలో విధులు నిర్వహించిన ఈయన, ఇక్కడికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానని స్పష్టం చేశారు.

## క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

రెబ్బెన, జూన్ 23 : బెల్లంపల్లి ఏరియా ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కోసం జీఎం కార్యాలయంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. బదిలీపై వచ్చిన, నూతనంగా విధుల్లో చేరిన ఏడుగురికి కేటాయించినట్లు ఎస్వోటూ జీఎం రాజమల్లు తెలిపారు. పర్సనల్ హెచ్‌వోడీ ఎస్‌వీ రాజేశ్వర్‌రావు, డీజీఎం(సివిల్) మదీనబాషా, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, ఖైర్‌గూడ వేల్ఫేర్ ఆఫీసర్ రజనీకుమార్, జూనియర్ అసిస్టెంట్ సాయివెంకటరెడ్డి ఉన్నారు.

## వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జైపూర్, జూన్ 23 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జైపూర్ పీహెచ్‌సీ వైద్యుడు ముస్తఫా పేర్కొన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. 25న నిర్వహించనున్న అంతర్జాతీయ మలేరియా దినోత్సవం గురించి వివరించారు. ఏపీఎం రాజ్‌కుమార్, వీవోలు, మండల సమాఖ్య లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రక్తదాన శిబిరం

కాసిపేట, జూన్ 23 : దేవాపూర్‌లోని లేడీస్ క్లబ్ ప్రాంగణంలో ఓరియంట్(అదానీ) సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో మంగళవారం మహా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. తలసేమియా, సికిల్ సెల్స్, బ్లడ్ క్యాన్సర్ బాధితులకు అవసరం ఉన్నట్లు పేర్కొన్నారు.

## తప్పించుకున్న ఖైదీ అరెస్ట్.. రిమాండ్

మంచిర్యాల అర్బన్, జూన్ 23 : ఓ మహిళ హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఖైదీని కోర్టులో హాజరుపర్చేందుకు పోలీసులు కోర్టుకు తీసుకరాగా, తప్పించుకొని గంట వ్యవధిలోనే పట్టుబడిన ఘటన సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో రెడ్డి కాలనీకి చెందిన తీగల భాగ్యలక్ష్మి(45)ని మిట్టపల్లి వీరాస్వామి 2024, డిసెంబర్ 8న హత్యచేశాడు. ఈ కేసులో వీరాస్వామిని మంచిర్యాల పోలీసులు అరెస్ట్ చేసి, ఆదిలాబాద్‌కు రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు. సోమవారం ఆదిలాబాద్ నుంచి మంచిర్యాల కోర్టుకు తీసుకరాగా, నీళ్లు తాగేందుకు వెళ్లిన వీరాస్వామి పోలీసుల కళ్లుగప్పి పారిపోయాడు. వెంటనే అప్రమత్తమై స్థానిక పోలీసుల సాయంతో చుట్టు పక్కల వెతుకగా గంట వ్యవధిలోనే పట్టుకున్నారు. ఈ విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా, తప్పించుకున్నది వాస్తవమేనని తెలిపారు. వెంటనే పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

## కాంగ్రెస్ నాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు

మందమర్రి, జూన్ 23 : మందమర్రి పట్టణంలోని పత్రికా విలేకరులను హేళనచేసేలా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు పైడిమల్ల నర్సింగ్‌పై పట్టణంలోని విలేకరులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీస్ ఔట్‌పోస్టుకు సదరు కాంగ్రెస్ నాయకుడు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై వార్తా కథనాన్ని ప్రచురించిన విలేకరి మడ్డి వేణుగోపాల్‌ను ఉద్దేశించి సోషల్ మీడియా వేదిక అనుచిత వాఖ్యలు చేయడాన్ని పట్టణంలోని విలేకరులు తీవ్రంగా ఖండించారు. విలేకరులను పరోక్షంగా దూషించిన నాయకుడు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## పలువురిపై కేసు

బెల్లంపల్లి, జూన్ 23 : నెన్నెల మండలం కారంపూడి శ్రీనివాస్ మృతిపై న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖాన ఎదుట గల 363 జాతీయ రహదారిపై ధర్నా చేసి వాహనాలను అడ్డగించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. జాడి నారాయణ, వేల్పుల మొగిలి, పొన్నాల జనార్దన్, మెండే కిష్టయ్య, ఇందూరి రమేశ్, లింగంపెల్లి అంకులు, లింగంపల్లి సంతోష్, రెచవేణి రాజేశ్, లింగంపల్లి రాజం, లింగంపల్లి బాపు, లింగంపల్లి తిరుపతి, కంబాల రాజలింగు, కంబాల మల్లేష్‌తో పాటు, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## సరిపడా ఎరువులు పంపించాలి

తాండూర్, జూన్ 23 : మండల రైతులకు సరిపడా ఎరువులు జిల్లా వ్యవసాయాధికారులు సమకూర్చాలని పీఏసీఎస్ చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి అన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పలు విషయాలపై చర్చించారు. మండలానికి 60 మెట్రిక్ టన్నుల ఎరువులు కావాలని అడిగితే కేవలం 12 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారన్నారు. ఉపాధ్యక్షుడు కడారి రత్నాకర్‌రావు, డైరెక్టర్లు గట్టు మురళీధర్‌రావు, మాసాడి తిరుపతి, పూసాల రాజేశం, ఎంఏ రవూఫ్, సీఈవో శ్రీనివాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఓసీపీ పీవోకు సన్మానం

శ్రీరాంపూర్, జూన్ 23 : శ్రీరాంపూర్ ఓసీపీ ఆఫీసర్ టీ శ్రీనివాస్ బదిలీపై వెళ్తుండగా, సోమవారం ఓసీపీపై టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేశ్, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. పిట్ కార్యదర్శి గడ్డం సుధాకర్, కేంద్ర నాయకులు గడ్డం మహిపాల్ రెడ్డి, భాస్కర్‌రావు, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ జంగా రమేశ్, అగ్గు తిరుపతి, రామగిరి సంపత్ కుమార్, వెంకన్న, బుర్ర శ్రీనివాస్, తిరుపతి, రాజకుమార్, క్రాంతి, మేకల రవి తదితరులు పాల్గొన్నారు.

## అనర్హులను తొలగించాలి

బెల్లంపల్లి, జూన్ 23 : బెల్లంపల్లి పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో షట్టర్ల జాబితాలో అనర్హులు పేర్లు తొలగించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్, పట్టణాధ్యక్షురాలు ధార కళ్యాణి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ చౌరస్తాలో పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కాంగ్రెస్ అండదండలతోనే అవకతవకలు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి కునిరాజుల అరవింద్, తాండూర్ మండల ఇన్‌చార్జి మద్దెర్ల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

## ఏటీఎం చోరీకి విఫలయత్నం

బెల్లంపల్లి, జూన్ 23 : పట్టణంలోని కాల్‌టెక్స్ ఎస్బీఐ ఏటీఎం కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు ప్రణాళిక ప్రకారమే దుండగులు గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్లతో ఏటీఎం సెంటర్‌కు వచ్చారు. ఏటీఎం బాక్సును గ్యాస్ కట్టర్‌తో కొంతమేర కట్ చేశారు. ఈ క్రమంలో అటువైపుగా పోలీసుల పెట్రోలింగ్ వాహనాన్ని చూసి, పారిపోయారు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు వెంట తెచ్చుకున్న కారంపొడి ప్యాకెట్‌ను ఘటనా స్థలంలో వదిలివెళ్లిపోయారు. హర్యానాకు చెందిన దుండగులు ఈ దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ముఠా కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఘటనా స్థలాన్ని డీసీపీ భాస్కర్, ఏసీపీ రవికుమార్, సీఐ అఫ్జలుద్దీన్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య, టూటౌన్ ఎస్ఐ మహేందర్ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ప్రైవేట్ స్కూల్ బస్సుల తనిఖీ

- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ సెయింట్ థెరిసా స్కూల్ బస్సు డ్రైవర్

తాండూర్, జూన్ 23 : తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సీఐ కే కుమారస్వామి ఆధ్వర్యంలో రాంనగర్, ఎన్టీఆర్ కాలనీ సమీపంలో రహదారిపై విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. అచ్చులాపూర్ నుంచి రేపల్లెవాడ వైపు వెళ్తున్న సెయింట్ థెరిసా పాఠశాల బస్సు డ్రైవర్ సత్యనారాయణకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేయగా, 205 ఎంజీ వచ్చిందని సీఐ తెలిపారు. వెంటనే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. బెల్లంపల్లి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా, జడ్జి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు వెల్లడించారు. డ్రైవర్‌ను జైలుకు, బస్సును స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

జన్నారం, జూన్ 23 : జన్నారం మండలం కలమడుగు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్చోడ మండలం లింగాపూర్ గ్రామానాకి చెందిన వనిత (34) మృతిచెందగా మరో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనిత తన తల్లి కస్తూలపురి గంగలక్ష్మితో కలిసి కలమడుగులోని బంధువుల ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో అతివేగంగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వారిని కరీంనగర్‌లోని దవాఖానకు తరలించారు. కాగా, పరిస్థితి విషమించడంతో వనిత చికిత్స పొందుతూ మృతిచెందింది. గంగలక్ష్మి చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### బొలేరో వాహనం ఢీ కొని ఒకరు..

బెల్లంపల్లి, జూన్ 23 : పట్టణంలోని గాంధీనగర్ పోచమ్మ ఆలయం ఎదుట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తాండూర్ మండలానికి చెందిన కూలీ వొడ్నాల వెంకటేశ్ (58) మృతి చెందినట్లు టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. కూలీ పనుల కోసం బెల్లంపల్లికి వచ్చిన వెంకటేశ్, ఆదివారం రాత్రి జాతీయ రహదారి దాటుతుండగా, బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

### ట్రాక్టర్ ఢీ కొని ఒకరికి తీవ్రగాయాలు..

కాగజ్‌నగర్, జూన్ 23 : కాగజ్‌నగర్ మండలం సార్సాల గ్రామ శివారులో సోమవారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలయ్యాయి. రైతు టాక్రె కాశీనాథ్ వ్యవసాయ పనులకు ఎడ్లబండిపై బయల్దేరాడు. ఈ క్రమంలో కాగజ్‌నగర్ నుంచి ఇటుకల లోడ్‌తో పెంచికలపేట్ వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో కాశినాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాగజ్‌నగర్‌లో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ దవాఖానకు తరలించారు. గతంలో సైతం ఇదే విధంగా ప్రమాధంలో మృతి చెందిన శ్రీకాంత్ కుటుంబానికి ఇప్పటికి వరకు న్యాయం జరుగలేదని గ్రామస్తులు స్పష్టం చేశారు. కాశీనాథ్‌కు న్యాయం జరుగాలని గ్రామస్తులు రోడ్డుపై ధర్నా చేపట్టారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, సమూదాయించే ప్రయత్నం చేస్తున్నారు.

## ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

బెల్లంపల్లి, జూన్ 23 : భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్థాపంతో బెల్లంపల్లి పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన పెయింటర్ షేక్ మొహమ్మద్(48) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాకేశ్ తెలిపారు. మొహమ్మద్‌కు తన భార్యకు మధ్య మనస్పర్థల కారణంగా కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. వారం క్రితం కూతురితో సహా భార్య హన్మాన్‌బస్తీలోని పుట్టింటికి వెళ్లింది. మనస్థాపం చెందిన మొహమ్మద్ అత్తగారింటి పెరటి ఆవరణలో చెట్టుకు ఉరేసుకున్నాడు. తన తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## పటిక, బెల్లం పట్టివేత

కౌటాల, జూన్ 23 : కౌటాల మండలం ముత్తంపేట గ్రామంలోని ప్రవీణ్ కిరాణా దుకాణంలో నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం, పటికను సోమవారం పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. సమాచారం మేరకు తనిఖీ చేయగా, నిల్వ ఉంచిన 160 కిలోల బెల్లం, 80 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నామని పేర్కొనారు. ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ సురేశ్, ఎక్సైజ్ పోలీసులు ఉన్నారు.

## ఒకరి బైండోవర్

హాజీపూర్, జూన్ 23 : హాజీపూర్ మండలం బుద్ధిపల్లి గ్రామానికి చెందిన దోసాల ఆదిత్యను సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ స్వరూప్ తెలిపారు. దోసాల ఆదిత్య గతంలో బౌతిక దాడి చేసినందున సత్ప్రవర్త కలిగి ఉండేందుకు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఏదైనా దాడులకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మహిళా సంఘం భవనంలో షార్ట్ సర్క్యూట్

హాజీపూర్, జూన్ 23 : హాజీపూర్ మండలం దొనబండ గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ సమాఖ్య మహిళా సంఘ భవనంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. టీ-ఫైబర్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో కుర్చీలు, ఫాగింగ్ మిషన్, ఫ్యాన్లు, టీ ఫైబర్ పరికరాలు కాలిపోయాయి.

## బస్సును ఢీ కొట్టిన లారీ

హాజీపూర్, జూన్ 23 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధి వేంపల్లి మేకల మండీ వద్ద సోమవారం బస్సును వెనుక నుంచి ఓ లారీ ఢీ కొట్టినట్లు హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ తెలిపారు. ఉట్నూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపునకు వస్తున్నది. ఈ క్రమంలో వేంపల్లి మేకల మండీ వద్ద మేకలు ఒక్కసారిగా అడ్డురావడంతో డ్రైవర్ బస్సును ఆపేశాడు. వెనకాలే వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఏమీ జరుగలేదు. డ్రైవర్ చొప్పదండి మొగిళి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.